క్లుప్తంగా

మద్యం దుకాణాల బంద్



'పురం'లో మూతపడిన ఓ మద్యం షాపు

హిందూపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13న పోలింగ్ జరుగుతుండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా మద్యం దుకాణాలను శనివారం సాయంత్రం మూసివేశారు. హిందూపురం పట్టణంతో పాటు లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో ఉన్న దుకాణాలను 48 గంటల ముందే ఈసీ ఆదేశాలతో మూసివేశారు. తిరిగి మద్యం దుకాణాలను 14వ తేదీ తీయనున్నారు.

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

మడకశిరరూరల్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఆదివారం రాత్రి 9 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకూ వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. సోమవారం ఉదయం 5 గంటల నుంచి 13 గంటల నుంచి సింగిల్ ఫేస్ విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలన్నారు.

పేట వేంకటరమణుడికి ప్రత్యేక పూజలు



మంగళ వాయిద్యాలతో ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని పేట వేంకటరమణస్వామి దేవస్థానంలో శనివారం ఉదయం శుక్లపక్ష తృతీయను పురస్కరించుకుని మూల విరాట్ వేంకటేశ్వరస్వామికి శ్రీమన్నారాయణ రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహా మంగళ హారుతులిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు పొంగళి నైవేద్యాన్ని అందజేశారు. అలాగే శ్రీదేవి, భూదేవి సమేత పేట వెంకటరమణస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువు దీర్చి మంగళవాయిద్యాలతో ప్రాకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ గౌరవాధ్యక్షులు భగీరథ నవీన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి



టీడీపీ వర్గీయులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న జిల్లా ప్రధానా కార్యదర్శి జీబీ శివకుమార్

గుడిబండ: మండల పరిధిలోని రాళ్లపల్లి పంచాయతీ కల్లురొప్పం గ్రామం టీడీపీ చెందిన తిమ్మరాజు, మంజునాథ్, హరీష్, విజయ్‌కుమార్ తదితర కుటుంబాలు శనివారం వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. వారికి జీబీ శివకుమార్ కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. శివకుమార్ మాట్లాడుతూ పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న ఎన్నికల్లో సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్ పక్షాన ప్రతి ఒక్కరూ నిలబడాలని కోరారు. మంజునాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మంచి చేసే నాయకుడిని మనం అందరం మళ్లీ ఎన్నుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అనంతరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ రాజు శింగనమలకు పారిపోవాల్సిందే..



మాట్లాడుతున్న మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడ్

గుడిబండ: అమరాపురంలో టీడీపీ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు ... వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పపై చేసిన అనుచిత వాఖ్యలను వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. శనివారం మండల కేంద్రంలోని జీబీ శివకుమార్ ఇంటి ఆవరణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడ్ మాట్లాడుతూ ఈరలక్కప్పకు వస్తున్న జనాదరణ ఓర్వలేక టీడీపీ అభ్యర్థి ఎంస్ రాజు చేసిన తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ఎవరి బినామీ కాదని, మడకశిర ప్రజలకు సేవకుడన్నారు. వచ్చే నెల 4న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పకు వచ్చే మెజార్టీ చూసి ఎంఎస్ రాజు మళ్లీ శింగనమలకు పారిపోవాల్సిందే అని హెచ్చరించారు. సమావేశంలో స్థానిక సర్పంచ్ కరుణాకర్, ఎస్టీ సెల్ జాయింట్ సెక్రటరీ గిరిధర్, రమేష్, లింగరాజు, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పురం

రెండుసార్లు హిందూపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన బాలకృష్ణ ఎప్పుడూ అందుబాటులో ఉండరు. రోడ్లు, డ్రైనేజీలు, నీళ్ల ఇలా ఏ బాధ చెప్పుకుందామన్నా ఆయన పీఏలే దిక్కు. వాళ్లూ స్థానికులు కాకపోవడంతో జనం ఇబ్బందులు పడ్డారు. అయితే ఐదేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడటం, మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీ పాలక వర్గం కొలువు దీరడంతో 'పురం'లో అభివృద్ధి వేగవంతమైంది. ప్రజలకు సేవ చేయడం బాధ్యతగా భావించిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు వాడవాడలా తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి తక్షణం పరిష్కరించే దిశగా కృషిచేశారు.

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో హిందూపురంలో జోరుగా అభివృద్ధి పనులు
- రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రాధాన్యం
- నాడు–నేడుతో మారిన పాఠశాలల రూపురేఖలు
- అర్బన్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణంతో అందుబాటులోకి వైద్యం



ముద్దిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ సెంటర్

హిందూపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హిందూపురం పట్టణ రూపురేఖలు మారాయి. మున్సిపాల్టీలో ప్రజారోగ్యానికి ప్రాధాన్యతమిస్తూ వార్డుల్లో డ్రైనేజీ, రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపాదించిన పనుల్లో దాదాపు 70 శాతం పనులు ఇప్పటికే పూర్తికాగా మరో 30 శాతం పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

వేగంగా పనులు

హిందూపురం మున్సిపాల్టీలో కాలవలు, రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. జనరల్ ఫండ్ కింద 345 రోడ్లు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటిలో రూ.169.53 లక్షలతో 169 పనులు పూర్తిచేశారు. మిగిలినవి వివిధ స్థాయిలో ఉన్నాయి. అలాగే 15 ఫైనన్స్ కింద 31 పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి అందులో 15 పనులు రూ.279.95 లక్షలతో పూర్తిచేశారు. మిగిలిన పనులు వివిధ స్థాయిలో ఉన్నాయి. తర్వాత జీజీఎంపీ కింద 39 పనులు మంజూరు కాగా వీటిలో 5 పనులకు రూ.78.25 లక్షలతో పూర్తి చేశారు. దీంతో ప్రత్యేక నిధులతో కలిపి 415 పనులలో 189 పనులు రూ.1127.729 లక్షలతో పూర్తిచేశారు. మిగిలినవి వివిధ స్థాయిల్లో పనులు సాగుతున్నాయి.

ప్రజారోగ్యానికి పెద్దపీట

ప్రజారోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. హిందూపురం పట్టణ పరిధిలో రెండు అర్బన్ హెల్త్ క్లినిక్స్ నూతనంగా నిర్మించారు. అలాగే వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తూ హిందూపురం పట్టణంలో ఒక అగ్రి ల్యాబ్‌ను నిర్మించారు. అలాగే పట్టణంలో పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే రోడ్డును 80 అడుగులతో అభివృద్ధి శ్రీకారం చుట్టారు. అయితే ఎన్నికల కారణంగా పూర్తిస్థాయిలో నిర్మాణం చేయలేకపోయారు. కాగా హిందూపురం పట్టణంలో కోట్నూరు, సూరప్పకుంట చెరువు కట్టలను అభివృద్ధి చేస్తూ ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యతగా వాకింగ్ ట్రాక్స్‌ను రూ.71 లక్ష నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు. అలాగే హిందూపురంలో పార్కుల అభివృద్ధికి ఒక రూ. రూ.1.12 కోట్లు కేటాయించి అభివృద్ధి చేశారు.



నింకంపల్లిలో పూర్తయిన సీసీ రోడ్డు



మారుతీనగర్ పూర్తయిన డ్రైనేజీ

హిందూపురం మున్సిపాలిటీలో అభివృద్ధి ఇలా..

పట్టణ జనాభా :	1.80 లక్షలు
కుటుంబాల సంఖ్య :	40 వేలు
సచివాలయాలు:	43
అర్బన్ హెల్త్ క్లీనిక్స్:	3
భూసార పరీక్షా కేంద్రం:	1
రోడ్ల అభివృద్ధికి వెచ్చించిన నిధులు:	రూ.7 కోట్లు
డ్రైనేజీల నిర్మాణానికి ఖర్చు చేసింది :	రూ.8 కోట్లు
నాడు-నేడు కింద అభివృద్ధి చెందిన పాఠశాల సంఖ్య :	44
కొత్త కమర్షియల్, కాయగూరల మార్కెట్ల నిర్మాణానికి ఖర్చు చేసింది :	రూ. 23 కోట్లు

అభివృద్ధి చేసి చూపించాం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో మున్సిపాల్టీ ఇప్పటి వరకు మూడేళ్లలోనే అన్నివార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించాం. ఏళ్లకాలం నాటి డంప్‌యార్డు సమస్య తీర్చాం. ముద్దిరెడ్డిపల్లిలో రోడ్లు, డ్రైన్లు లేక ఏళ్లతరబడి సమస్య ఉండేది. సుమారు రూ.7 కోట్లతో ఆయా వార్డుల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు వేయించాం. త్వరలోనే రైల్వేరోడ్డు నిర్మాణం కూడా పూర్తికాబోతోంది.

– ఇంద్రజ, మున్సిపల్ ఛైర్‌పర్సన్, హిందూపురం

అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు



టీడీపీ ప్రభుత్వ హయాంలో వారి కౌన్సిలర్లు ప్రతినిధ్యం ఉన్న చోటనే రోడ్లు, డ్రైనేజీలు ఇలా అన్ని పనులు చేసేవారు. వైఎస్సార్‌సీపీ పాలనలో మున్సిపాల్టీలో అన్నివార్డుల్లో డ్రైనేజీలు, రోడ్లు వేయిస్తున్నారు. వార్డుల్లో వీధుల్లో సదుపాయలు కల్పిస్తున్నారు. సదాశివనగర్, హనుమాన్‌నగర్, మేళాపురం ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడం హర్షణీయం.

– వెంకటేష్, మేళాపురం, హిందూపురం.

సేవలు మరువలేనివి



గతంలో ప్రభుత్వ పథకాల కోసం, పింఛన్ల కోసం ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరిగాల్సి వచ్చేది. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఆ సమస్యలన్నీ తీరాయి. ప్రతిదీ వలంటీర్లు ఇంటికి వచ్చి పరిష్కరించారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి ఆలోచన చేయకపోవడం విచారకరం. జగనన్న ప్రభుత్వం మళ్లీ రావాలని కోరుకుంటున్నాం.

– పార్వతీ, గోకుల్‌నగర్, హిందూపురం

మురుగు సమస్య లేదు



గతంలో రోడ్లు, డైనేజీలు అంతంత మాత్రంగా ఉండేది. ఈ ఐదేళ్లలో చాలా వరకు వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు వేయించారు. వర్షాలు వస్తే రోడ్లపై మురుగు వచ్చేది. ఇప్పుడు డ్రైనేజీల నిర్మాణం వల్ల ఆ సమస్య లేదు. హిందూపురంలో రైల్వేరోడ్డు పనులు కూడా పూర్తయితే చాలా వరకు ప్రజలకు ట్రాఫిక్ సమస్య కూడా తీరిపోతుంది.

– జిమ్స్, దీఆర్‌కాలనీ, హిందూపురం

వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటాం



సమావేశమైన వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లు

మడకశిర: నియోజకవర్గంలో వక్కలిగ కులస్తులు అందరూ వైఎస్సార్‌సీపీకి అండగా ఉండి సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ గెలుపునకు కృషి చేయనున్నట్లు రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ నళిని, డైరెక్టర్లు వీరక్యాతరాయప్ప, నేత్రావతి, నాగప్ప, వేణు, నాగరాజుగౌడుతో పాటు బోయ కార్పొరేషన్ డైరెక్టర్ రామక్రిష్ణ పేర్కొన్నారు. వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు తదితరులు పట్టణంలో శనివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఓసీలుగా ఉన్న వక్కలిగ కులస్తులను బీసీ జాబితాలోకి చేర్చి విద్య, రాజకీయంగా, ఉద్యోగ అవకాశాల్లో సముచిత న్యాయం కల్పించారని గుర్తు చేశారు. ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ప్రత్యేకంగా రాష్ట్రంలో కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్‌తో పాటు 10 మందికి పైగా డైరెక్టర్లను నియమించారన్నారు. కుంచిటి వక్కలిగ కులస్తులకు ఇంతల గౌవరం ఇస్తున్న సీఎం జగన్‌కు అండగా ఉంటూ సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఈరలక్కప్ప, శాంతమ్మ గెలుపు కోసం నియోజకవర్గంలోని వక్కలిగ కులస్తులు కృషి చేస్తామన్నారు. మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. వైఎస్సార్‌సీపీకి వక్కలిగా కులస్తులు ఎల్ల వేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంగేగౌడు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

చిలమత్తూరులో పోలీసు కవాతు



చిలమత్తూరులో సాయిధ బలగాలు కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

చిలమత్తూరు: మండలంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో సాయుధ బలగాలతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. శనివారం చిలమత్తూరు, హస్నేన్‌పురం, కొడికొండ తదితర గ్రామాల్లో కవాతు నిర్వహించి ప్రజలకు సూచనలు చేశారు. 13న ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నామని సీఐ ఈరన్న తెలిపారు. ప్రజలు ప్రశాంతంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ గంగాధర్, ఆర్మీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'పురం'లో కాంగ్రెస్‌కు ఝులక్



రేష్మాను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక

- కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ వైఎస్సార్‌సీపీలో చేరిక

హిందూపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి చూసి కాంగ్రెస్ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ రేష్మా అన్నారు. హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి టీఎన్.దీపిక పార్టీ కార్యాలయంలో రేష్మాకు కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాలాజీ మనోహర్, అమానుల్లా, ఆదిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటేస్తే సంక్షేమ పథకాలకు ముగింపే



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప



ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

గుడిబండ: జగనన్నతోనే రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి సాధ్యమని మడకశిర వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప తెలిపారు. సంక్షేమ ప్రధాత వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంగా చేసుకోవాలంటే మరోసారి ఓటర్లందరూ రెండు బటన్లు నొక్కాలన్నారు. పొరపాటును టీడీపీకి ఓటేస్తే సంక్షేమ పథకాలకు ముగింపు పలికినట్లేనని స్పష్టం చేశారు. గుడిబండ మండల పరిధిలోని రాళ్లపల్లి గ్రామంలో శనివారం వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులతో కలిసి పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అన్నీ ప్రాంతాల్లో ప్రజలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఈరలక్కప్ప మాట్లాడుతూ కరోనా సమయంలో కూడా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించి, ప్రజల ఆర్థిక ఇబ్బందులను తొలిగించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మడకశిర ఓటర్లు కులం కాకుండా గుణం చూడాలన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వారు కావాలో..... మంచి వ్యక్తిత్వం ఉన్నవారు కావాలో మడకశిర ఓటర్లే నిర్ణయించుకోవాలన్నారు. చంద్రబాబు చెబుతున్న హామీలన్నీ ఆచరణకు సాధ్యం కావన్నారు. ప్రజలు నమ్మరని తెలిసినా రకరకాల పథకాలు ప్రకటించారన్నారు. 2014 ఎన్నికలకు ముందు 600కు పైగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. ఎమ్మెల్యేగా తనతో పాటు ఎంపీ అభ్యర్థి శాంతమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విన్నవించారు. తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సురేష్, నాగేంద్ర, నాయకులు అనంతరాజు, తిమ్మరాజు, మంజునాథ్, హరీష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో అందరికీ సముచిత స్థానం

చిలమత్తూరు: మండలంలోని చిన్నన్నపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు శంకరప్ప, నాగరాజు, నంజప్ప, సూర్యనారాయణ తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వారికి ఎంపీపీ పురుషోత్తమరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదే విధంగా కొడికొండకు చెందిన టీడీపీ కార్యకర్త నరేష్ కుటుంబ సభ్యులు మండల కన్వీనర్ రాజారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.

పార్టీలో అందరికీ సముచిత స్థానం ఉంటుందని ఎంపీపీ తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీపీ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

ప్రచారంలో 'ఫ్యాన్' జోరు

సాక్షిబృందం: చివరి రోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో శనివారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహించాయి. హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపిక, మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, ఎంపీ అభ్యర్థి శాంతమ్మలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తేనే సంక్షేమాభివృద్ధి సాధ్యమని వివరించారు.



గుడిబండలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మహిళా కార్యకర్తల ప్రచారం



మడకశిర మండలం చందకచెర్లలో ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ముత్తేపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం



అమరాపురం మండలం వీరాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



సిద్దగిరిలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్న వారిని ఆహ్వానిస్తున్న ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి



గౌరిపురంలో వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి

మడకశిరరూరల్: జగనన్న సంక్షేమ పాలనకు జేజేలు పలుకుతూ మరోసారి వైఎస్ జగన్‌ను సీఎంగా చేసుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం గౌరిపురం, సిద్దగిరి గ్రామాలకు చెందిన 30 కుటుంబాలు వివిధ పార్టీలను వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. సిద్దగిరిలో ఏడీసీసీ బ్యాంకు మాజీ ఉపాధ్యక్షులు ఆనందరంగారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో టీడీపీ వీడి కేశవరెడ్డి, హనుమంతరెడ్డితో పాటు పలు కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. అదే విధంగా గౌరిపురంలో ఎంపీటీసీ కవిత, సర్పంచ్ గీత ఆధ్వర్యంలో 20 కుటుంబాలు టీడీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీలను వీడి వైసీ గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శింగనమల నుంచి దోచుకోవడానికి మడకశిరకు వచ్చిన టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజును ఓటు ద్వారా చిత్తుగా ఓడించాలన్నారు. అందరికీ అందుబాటులో ఉన్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, ఎంపీ అభ్యర్థి శాంతమ్మలను భారీ మెజార్టీతో గెలిపించాలని ఇందుకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగనాథ్, నాయకులు నరసింహారెడ్డి, రాజేష్, శ్రీరామరెడ్డి, రంగనాథ్, నాగభూషణరెడ్డి, రామచంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.



రొళ్లలో తాలూకా ఎన్నికల ఇన్‌చార్జ్ అనంతరాజు సమక్షంలో పార్టీలో చేరుతున్న టీడీపీ నాయకులు

రొళ్ల: మండల కేంద్రంలో తాలూకా ఎన్నికల ఇన్‌చార్జ్ అనంతరాజు సమక్షంలో శనివారం టీడీపీ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. గొట్టుగుర్కి గ్రామానికి చెందిన టీడీపీ మైనార్టీ సంఘం నాయకుడు అబ్దుల్లా అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువా వేసి సాదరంగా పార్టీలోని ఆహ్వానించారు. కార్యక్రమంలో జేసీఎస్ తాలూకా బూత్ ఇన్‌చార్జ్ నాగేంద్ర, పార్టీ మండల కన్వీనర్ నరకసింహారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ శివలింగప్ప, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సంతోష్, బీజీ హళ్లి, గుడ్డగుర్కి సర్పంచ్ సదాశివప్ప, హరిక్రిష్ణ, నాయకులు ముదుపేగౌడు, శ్రీరామప్ప, పరమేశప్ప, శివన్న, కేజీ మంజునాథ్, బసవరాజు, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.